# చేతకాని మనిషి

ముదిలి మహేశ్వరరావు

**లంచము ఇవ్వడం పుచ్చుకోవడము కూడా కళే! అది అందరికీ అలవడేదికాదు. అలవాటు లేనివాళ్ళు, చేతకానివాళ్ళు కక్కుర్తిపడితే జరిగేది అవమానమే!**

"న్యాయానికి, ధర్మానికికట్టుబడడం చాలా గొప్పవిషయం. కాని అవి కేవలం తమలోనే ఉన్నవని నమ్మడంమాత్రం అవివేకం. అప్పుడు ఎదుటివారిపట్ల నమ్మకం ఏర్పడదు. తోటి మానవుల్ని నమ్మలేక పోవడం అంతటి అనర్థం ఇంకొకటి లేదు." అనంతరామయ్య అన్నాడు.

నేను అతనివైపు చూశాను. నొసలు ముడి పడి. కనుబొమ్మలు పైకెత్తివున్నాయి. ఎంతో అనుభవం వున్నట్టు ఆ ధ్వనే చెబుతున్నది. కానీ నాకింకా కుదరటంలేదు. వధానిగారు నా దృష్టిలో గొప్పవారు. ఉత్తములు కేవలం ఒక యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనబట్టి వారి వ్యక్తిత్వాన్ని మూడు వాక్యాలలో నిర్వచించడం– అనంతరామయ్య సాహసమే చేశాడు.

నా సంగతి గమనించాడు అనంతరామయ్య. 'పిచ్చివాడా' అన్నట్టుగ నవ్వేడు. నాలో మళ్ళీ ఆలోచన రేగింది.

అసలు అవధానిగారు నెమ్మదస్తులు. పొరపాటునకూడా అబద్ధం ఆడరు. అందుకు కారణం, ఆఫీసులో ఆఫీసరు, యింట్లో యిల్లాలు. ఇక బయట ప్రపంచంతో ఆయన కాస్తై సంబంధం వుండదు. బజారు విషయం బావమరది చూసుకుంటే, ఫస్టుతారీఖు జీతంతో చాకలేగాని, మంగలేకాని అంతా భార్య చూసుకుంటుంది. పిల్లలు ముగ్గురు తండ్రిని గురించి అట్టే పట్టించుకోరు. అందుకుగాను ఓ ఉదాహరణ. చిన్నవాడు ఏదైనా చదువుతున్నప్పుడు అవధానిగారు "ఏమట్రా అది" అని అడిగితే, వాడా పుస్తకాన్ని మూసేసి "ఏదోలే" అంటూ అక్కడ్నించి లేచి పోతాడు.

ఇల్లాలు కామేశ్వరమ్మ దృష్టిలో అవధానిగారు భయస్థుడు, పిరికివాడు లేక వట్టి చచ్చుదద్దమ్మ. ఆఫీసరుగారి దృష్టిలో నెమ్మదస్తుడని తెలిసినవాడు, వినయ విధేయతలు గలవాడు. పై కారణంగా కానీ లేదా తదితర కారణాలవల్ల నయితేనేమి అవధానిగారు పది సంవత్సరాలు వరుసగా 'డిస్పేచ్' సెక్షన్‌లో పనిచేస్తూ వచ్చారు. గానుగెద్దుపనే అయినా, ఆయన తనధోరణిలో ఆయన చేసేవారు. తర్వాత సడన్‌గా ఆఫీసను "ఎకౌంట్సు సెక్షన్"లోకి మార్చేడు.

డబ్బుచేసుకొనే ఆ సీటులోకి మారినందుకు మిగతా ఆఫీసువాళ్లు అవధానిగారిపై ఏమాత్రం ఈర్ష్య చెందలేదు పైగా హాయిగావున్నారు. అందుకు కారణం అంతవరకూ ఎక్కౌంటు సీట్ చలపతి డిస్పాచ్‌లోకి మారడమే

ఆఫీసులో మళ్ళీ తనువుండీ వుండనట్లే అనిపించారు అవధానిగారు

అకస్మాత్తుగ అవధానిగారు సుబ్బయ్య నాయుడు దగ్గర బిల్సు చెక్‌చేస్తూ స్వంతానికి మూడువందలు పుచ్చుకున్నాడని ఆఫీసంతా గుప్పుమంది. ముక్కున వేలేసుకున్నారు కొంతమంది "అయితే నివురుగప్పిన నిప్పు"అన్నారు ఇంకొంతమంది. "అసలు ఆసీటేఅంత"– ఒక వ్యాఖ్యాత. చలపతి కుటిలంగానవ్వుకున్నాడు.

నేను నమ్మలేదు. ఏదో పొరపాటు జరిగుండాలన్నాను. కానీ కమ్యూనిస్టు సత్యారావు తేలికగా తీసిపారేశాడు. లంచం పుచ్చుకోని ఆఫీసు లేదన్నాడు. లేదా లంచం లేకపోతే ప్రభుత్వమే సాగదన్నాడు. ఎటొచ్చీ అవధానిగారు ప్రారంభ దశలోనే వున్నాడన్నాడు.

అయినా... అవధానిగారు ఆయన అంత మందిలో బంట్రోతుని, టైపిస్టు నాగలక్ష్మిని, గుమాస్తాల్ని, ఆఫీసర్ని "ఏమండీ" అనే అంటాడు కానీ చాలామంది అతన్ని అలా పిలవరు. నేనుమాత్రం అవధానిగారూ అంటాను. అందుకు కారణం, ఆయనమీద కొంతజాలి, మరికొంత గౌరవభావం కావచ్చు.

అవధానిగారు వెండి చెంచాను నోట్లో వుంచుకొని పుట్టినవాడు కాదు. ఆ విధంగా పుట్టని అసంఖ్యాక దీన మానవానీకంలో ఆయ నొకరు. ఎడమ వైపునగాని, కుడివైపునగాని అతడిపేరుకు అతికింపులు లేవు.

◆ ◆ ◆

సాయంకాలం పార్కులో మళ్ళీ అనంతరామయ్య కలిసాడు. ఈసారి అతనితోపాటుగ కమ్యూనిస్టు సత్యారావు, చలపతీ వున్నారు.

'రావోయ్ నీకోసమే చూస్తున్నాం.'

మెల్లగా నవ్వి నేనూ చతికిల బడ్డాను. మళ్ళీ మొదలయింది అవధానిగారిమీద చర్చ.

'నిజంగా మన కొత్త ఆఫీసరు మంచాడు పిల్లలు గలవాడుకదాఅని అవధాన్ని అంతటితో వదిలి పెట్టాడు' అనంతరామయ్య అన్నాడు.

'ఆఁ ఆయనకేంత తడిపాడో' మామూలు ధోరణిలోనే మాట్లాడాడు చలపతి.

'ఛ ఛ ఆయనటువంటివారు కాదు'అన్నా

'అబ్బాయ్ నీకు తెలీదు. కుర్రవాడివి అందునా కొత్తవాడివి. అయినా ఇటువంటి విషయాలు తెలియాలంటే ఎంత అనుభవం వుండాలి. అసలు నాగలక్ష్మిని గురించి నీకు ఏం తెలుసు చెప్పు'అన్నాడు అనంతరామయ్య.

నేనేం మాట్లాడలేదు. నిజమే నాకు తెలియదు.

కాని అవధానిగారిలాంటి పని చేశారని కాదు– అంత ధైర్యం ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోయా.

(తరువాయి 19 వ పేజి)

## ★ చేతకాని మనిషి ★

(15 వ పేజి తరువాయి)

అయితే ఆనాటి రాత్రి ఆయన్ని, ఆ కుటుంబాన్ని జాగ్రత్తగ పరిశీలించి అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే కొంత తెలియక పోదు.

ఆఫీసులో నానా చాకిరీచేసి ఇంటికివచ్చి తలుపు తట్టేసరికి తలుపులు అవే తెరుచుకున్నాయి. తలవంచే మూలగా చూశాడు.

పడుకునే అడిగింది కామేశ్వరమ్మ- 'ఇప్పటికి తెమిలిందన్నమాట' ఆ మాటలో, ఆమె తీరులో అధికారం వున్నమాట నిజమే. కాని గయ్యాళితనం కన్పించదు. సినిమాల్లో కనిపించే గయ్యాళులకు ఈమెకూ పోలికేలేదు. తనలో ఓ మూలగా పడి వుండి, అనేకసార్లు బాధపడిన వ్యక్తిత్వాన్ని, మనస్సుని, మళ్ళీ సంతోషపరచటానికిగాను ఆమె ఇలా భర్త మీద పెత్తనం చేస్తుంటుందని సులువుగా కనిపెట్టేవచ్చు.

'అవనిలో నావంటి ఆడజన్మముకన్న రాయిగా పడి వుండటం గూడా మేలేనన్నది' ఓ రచయిత్రి. కాకపోతే మరి మానవజన్మ మెత్తి కామేశ్వరి యేం సుఖపడిందని? ఎనిమిదో ఏడు జరుగుతుండగా తల్లి పోయింది. మారు తల్లి కాపురానికి వచ్చింది. అప్పట్నించీ ఆమెకు బ్రతుకంటే ఓ సంఘర్షణ అని అర్థమయింది. తండ్రి ఆమెతో మేలు చేయగలిగాడు. కామేశ్వరమ్మ చదువుకుంది. ఆ చదువుతో చిన్న వుద్యోగం చేయగల విశ్వాసం కద్దు. కాగా ఆ చదువువల్ల పాసైవుండి, వుద్యోగం చేసివుంటే, ఈ జీవితం ఇలా జరిగేది కాదు కదా అన్న ఆవేదనమాత్రం మిగిలింది.

కానీ జరిగిందేమిటి? అవధానిగారితో సంసారం.

క్రమంగా ఆమె మారిపోవడంలో వింత లేదు బంగారు నగలేకపోవడం కన్న, బంగారం కవరింగు నగ వుండడం ఎంతో మేలు. ఇది బంగారం కాదు అని మనస్సులో మాటి మాటికీ పొడుస్తున్నా, పైకి చాలా మందికి బంగారంలా కనిపిస్తుంది కదా అనే గర్వం, తృప్తీనూ.

భోజనం తనే వడ్డించుకున్నారు అవధాని. ఆడపిల్ల లిద్దరూ మంచంమీద పడుకొని వున్నారు. చదువుతూ నిద్రపోయినట్లుంది- పుస్తకాలు క్రిందపడి వున్నాయి. అవి జాగ్రత్తగా తీసి అలమారలో పెట్టాలనుకున్నారు.

మంచంమీదకు వాలింతర్వాత మెల్లగా 'కామూ' అంటూ పిలచారు.

మెలకువగావుంటే కామేశ్వరమ్మ పలుక లేదు. చిమ్మచీకటిలో మినుకు మినుకు మంటున్న గుడ్డి దీపానికిమల్లె దూరంగా తల్లి మీద కాళ్ళుపారేసి దగ్గుతున్నాడు చిరంజీవి చంద్రం. అవధానిగారి కొడుకు.

అలానే కొంతసేపటికి నిద్రపోగలిగారు అవధాని.

ఆ మర్నాడే... ఆఫీసునుంచి యింటికి తిరిగొస్తున్నారు. ఆలోచనా తరంగాలు.

'నువ్వు న్యాయపరుడవని, ధర్మంగా నడుచుకుంటావని నాకు తెలుసు. అందుకే ఈ సెక్షన్‌లోకి మారుస్తున్నాను' అన్న ఆఫీసరు ఇంగ్లీషు మాటలు.

మర్యాదగా, స్నేహపూర్వకంగా నవ్విన నాగలక్ష్మి.

అబ్బ ఎంత అందంగా నవ్వగలదు.

అంతవరకూ తనలో ఓ మూలనున్న ఆధిక్యత అలలుగా పైకి వచ్చింది. నిజమే. ఆఫీసరు నిజమే మాట్లాడాడు.

చలపతి ఎకౌంటు సెక్షనులోకి వచ్చి రెండేళ్ళకే ఇల్లు కట్టాడు.

కమ్యూనిష్టు సత్యారావు ఫైళ్ళతోబాటు నోట్లుగూడా చూస్తేకానీ ముందుకు పంపడు.

అనంతరామయ్య డబ్బుకక్కుర్తి బంట్రోతుక్కూడా తెలుసు.

ఆఫీసరు వాటా అంతుంటుంది, ఇంతుంటుంది అని అంతమందీ వూహించుకోవడమే.

ఇహ నాగు లక్ష్మి సంగతి చెప్పనే అక్కరలేదు.

నిజం. నిజం. ఎన్నాళ్ళుగానో గుర్తించని సత్యం - పుట్టు గ్రుడ్డి అకస్మాత్తుగా కళ్ళు తెరిచినట్టుగా అవధాని గుర్తించారు. సత్యారావు అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

తన ఆఫీసులోనే కాదు - ప్రతి ఆఫీసునూ ఒక్క ఆఫీసులోనేకాదు, ప్రపంచం అంతటా స్వార్థంలేని చోటు లేదు. ప్రతీవాడూ తన బాగుకోసం చూచుకొనేవాడే.

అకస్మాత్తుగా అవధానిగారి గుండె వుప్పొంగింది. అవును అంతా అవినీతిపరులు. స్వార్థంతో జీవిస్తున్న వుద్యోగస్థులు. న్యాయం పేరు ఉచ్చరించడానికికూడా తగరు. ఎంతో ధైర్యం, బలం వచ్చినట్టనిపించింది. తన చేతకానితనం, పిరికితనం - ఇలా న్యాయంగా, ధర్మంగా నడిపిస్తూ వచ్చిన సంగతి అతను మర్చిపోయేడు. తనొక్కడే, న్యాయపరుడు జీవించినట్లు అనిపించింది, మనుషులలో నమ్మకంపోయింది.

మొట్టమొదటిసారిగ ఇంట్లో భార్యపై అధికారం మోయించేసరికి, ఆవిడపొందిన ఆశ్చర్యం భాష్యానికి అంతుపట్టదు. తర్వాత ఆవిడకూ మగడి మనసు తెలిసింతర్వాత ఆనందపడ్డది.

ఆరోజు అసలు భోజనమే మర్చిపోయారు.

సుబ్బయ్య నాయుడు ఫైల్సు నాలుగు తన చేతులలో. అతగాడు ఎంతో లౌక్యుడని ప్రతీతి. పట్టణంలో ఒక పెద్ద ఆస్తిపరుడు. కాంట్రాక్టరు.

అటువాడు తన చేతులు పట్టుకొన్నాడు. నెమ్మదిగా మాట్లాడాడు తనతో. కానీ ఎలా అడగడం? ఎలా? ముఖంమీద చెమటలు పట్టున్నాయ్.

"మీరు అడగడమే తరువాయి, తప్పకుండా యిస్తాడు." కామేశ్వరమ్మ అన్నది.

"ఉన్నదీ పోతేనో" అంతలోకి మళ్ళీ భయం. అందరికీ చెప్పేస్తాడేమో. ఈ ఉద్యోగం వూడుతుందేమో!

"యి, స్తా, డు" వత్తి, వత్తి, పలికింది కామేశ్వరమ్మ.

◆ ◆ ◆

తర్వాత ఇంకేం కథా లేదు కొంతకాలం పాటు ఇంక్రిమెంటు స్టాపుచేసి మళ్ళీ "డిస్పాచ్" సెక్షన్‌లోకి మార్చబడ్డాడు అవధాని. దానికి నాకంత బాధనిపించలేదు. కాని ఆయన పరిస్థితిపూర్తిగ చెడిపోయింది తనలో తనే ఏదో గొణుక్కుంటాడు. అప్పుడే చాలా మంది వీధులో వాళ్ళు, బజారులోనూ, 'పిచ్చి వాడురా, లంచం దెబ్బవల్ల పిచ్చిపట్టుకుంది" అనేస్తున్నారు.


# శుభవార్త

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి నపుంసకత్వము, సంతానము లేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్స వల్ల దేహములోవున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును.
వివరములు కోరువారుపోస్టుఖర్చులకుఒకరూపాయి పంపవలయును.

అడ్రసు:

**శ్రీ యోగాశ్రమము**

**P. O. పెదవాల్తేరు**

**విశాఖపట్టణము — 3**


# నే వస్తున్నా!

నీ పక్కడ!
నే నిక్కడ!!
పిలుస్తుంది మనల వేయ్యేళ్ళ నేస్తం
మరువాలన్నా మరపురాదా వాస్తవం

ఆశ అంతరించలేదు
మమత మరుగుతోంది
ఆహ్వానిస్తుంది శారద రాత్రి
నవ్వుతోంది నన్నుచూచి నిశారాత్రి
బ్రతుకలేక బ్రతుకుచున్నాను
గుండెలపై రగుల్తోంది నిప్పుల కుంపటి
ఏనాటిదో మనకీ సంబంధం
ఏకముచేయలేని ఎడబంధం

అపహసిస్తుంది లోకం
ఆరిపోదు మనకీ శోకం

ఎంతకాలము యీ శాపం
ఎందుకు మనకీ తాపం

కట్టుచున్నారు కర్కోటకులు
కాలానికి కత్తుల వంతెన

ప్రసవవేదన పడుతోంది ప్రజాలోకం
ప్రజ్వరిల్లుతుంది లేమన ప్రణయ నాకం

అపజయమెరుగని మన ప్రణయం
ఆదర్శము కావాలి ముజ్జగాలకు

కారుచున్న నీ కన్నీళ్ళు నా హృదిలో చూస్తున్న
కలతమాని కన్నీళ్ళు తుడుచుకో నే వస్తున్నా.

కొండ్రు శ్యామ్‌చంద్